# నైజం

ఉదయం తొమ్మిది గంటలు. ఎండ బాగానే ఉన్నట్లుందే అనుకుంటూ హడావిడిగా నడవసాగాను. అర్జంటుగా రంగనాథంగార్ని కలవాలి. 'పది గంటలయితే ఆయన ఇంట్లో ఉండరు. ఆఫీసుకు వెళ్ళిపోతారు' అనుకుంటూ గబగబా వారింట్లో అడుగుపెట్టాను. మా వీధిలో ఇల్లే కాబట్టి త్వరగానే చేరాను.

నేను వెళ్ళేసరికి ఆయన ఫోన్లో మాట్లాడుతున్నారు. నన్ను చూసి కూర్చోమన్నట్లు సైగ చేశారు. నేను నవ్వి కూర్చున్నాను.

రంగనాథం మా ఆఫీసరు. నేను ఆయన సహోద్యోగిని. ఆయనికి నోటిదురుసు ఎక్కువని ఒక పేరు ఉంది. కానీ నా అదృష్టం ఎప్పుడూ నాతో బాగానే మాట్లాడేవారు. అందరినీ ఇట్టే ఆకట్టుకోగల విగ్రహం.


ఆయన మాట వినపడి, ఈ లోకంలోకి వచ్చాను.

''హలో ఫలానా నెంబరేనా, నేను రంగనాథాన్ని మాట్లాడుతున్నాను. మీ ఇంట్లో రూములో ఉంటున్న మా అమ్మాయిని, అదే వైష్ణవిని ఒకసారి పిలుస్తారా? ప్లీజ్.. పది నిమిషాల్లో ఫోన్ చేస్తాను. ఏమీ అనుకోవద్దు. ప్లీజ్..'' అంటూ చాలా ఆప్యాయంగా, సౌమ్యంగా గొంతు వినపడ్తోంది.

ఫోన్ పెట్టి నావైపు తిరిగి ''ఏంటోయ్ రంగా చాలాకాలానికి ఖాళీగా కనిపించావు. నేనే నిన్ను కలవాలని అనుకుంటున్నాను'' అని చాలా మర్యాదగా మాట్లాడి, కాఫీ కూడా ఆఫర్ చేశారు.

ఇంతలో ఫోన్ రింగయ్యింది. ఎత్తి ''హలో'' అంటూ సౌమ్యంగా మాట్లాడిన స్వరం కాస్తా, సీరియస్‌గా మార్చి ''ఏమిటయ్యా వేళాపాళా లేకుండా ఫోన్లు. ఇప్పుడు ఎవర్నీ పిలవడం కుదరదు'' అంటూ లైను కట్ చేసి, నావైపు చూసి ''ఎవరో రావుగారట, వాళ్ళ అబ్బాయి విజయ్‌కి ఏదో యాక్సిడెంట్ అయ్యిందట. వారికి కబురు చెప్పమని ఫోన్'' అంటూ నవ్వుతున్నాడు.

నేను అవాక్కయ్యి చూస్తూ ఉండిపోయాను.



''ఇంతకీ నువ్వు వచ్చిన పని ఏమిటి?'' అని నాతో మాట్లాడి చాలా మర్యాదగా నన్ను సాగనంపాడు.

కానీ నాలో ఒక్కటే అనుమానం. నన్ను అంత మర్యాదగా చూడడం ఏమిటా అని?

తర్వాత నాకు తెలిసిందేమిటంటే, మా అబ్బాయి బుద్ధిమంతుడని తెలిసి వాళ్ళ అమ్మాయినిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నాడని.

కానీ ఆయనకు తెలియనిదేమిటంటే- ఆ విజయ్ నా కొడుకని, ఆ రావుగారు ఈ రంగారావేనని తెలియదు. పాపం తెలిసుంటే ఒక మానవత్వపు తొడుగు కప్పుకుని నటించేవాడు.

మనసు బాధ పడుతుంటే, ఈ శరీరం మాత్రం తక్షణ కర్తవ్యంగా విజయ్ దగ్గరకు బయలుదేరింది.

**-పి.వి.ఎస్.కృష్ణవేణి (రాయపల్లి)**

